సాక్షి వికారాబాద్

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



నేరాల నియంత్రణ..

నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. 8లో▸



తాళం వేయ'బడి'!

గుంతబాస్పల్లి పాఠశాల సోమవారం తెరుచుకోకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8లో▸



పశు బీమా అందేనా?

పశు బీమా పథకం అమలు కాకపోవడంతో రైతులు వ్యవసాయ పరంగా, ఆర్థికంగా నష్టపోతున్నారు. 9లో▸



బొంరాస్‌పేట: ఎన్కేపల్లి వద్ద తాడు సాయంతో వాగు దాటుతున్న రైతులు



కోట్‌పల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న వరద నీరు



ఇంటిలోకి నీరు చేరిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళ



బషీరాబాద్: జీవన్గీలో జోరుగా పారుతున్న వరద నీరు

ముంచెత్తిన వాన!

జిల్లాలోని పలు చోట్ల సోమవారం వర్షం దంచి కొట్టింది. పంట పొలాలు, రోడ్లు జలమయ మయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బొంరాస్‌పేట మండలం ఎన్కేపల్లి వద్ద వాగు దాటేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. తాడు సాయంతో అవతలి ఒడ్డుకు చేరుకుని వ్యవసాయ పనులు చేసుకున్నారు. బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. ఇళ్లలోకి చేరిన నీటితో జనం అవస్థలు పడ్డారు. ధారూరు మండలం కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఒక్క రోజులోనే మూడు అడుగుల నీరు చేరింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వాగుల ద్వారా వరద ప్రవాహం పెరిగిందని ఇరిగేషన్ డీఈ భాస్కర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఉదయం వరకు 16 అడుగుల మేరకు నీరు చేరగా అదే రోజు రాత్రి నుంచి సోమవారం ఉదయానికి వరద నీరు మూడు అడుగుల వరకు పెరిగిందని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం వరకు మరో అడుగు చేరే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 19 అడుగుల నీరు ఉన్నట్లు వివరించారు.

– వికారాబాద్/ధారూరు

న్యూస్‌రీల్

అనుమతులు ఇవ్వొద్దు



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

యాలాల: మండలంలోని కాకరవేణి నది నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పనులకు ఇసుక అనుమతులు ఇవ్వరాదంటూ యాలాల, విశ్వనాథ్‌పూర్, గోవిందరావుపేటకు చెందిన రైతులు కోరారు. సోమవారం వికారాబాద్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కాకరవేణి నది నుంచి ఇసుక అనుమతుల కారణంగా వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. నది పరీవాహక ప్రాంతంలో బోరుబావులు అడుగంటిపోతున్నాయని వాపోయారు. ఇసుక అనుమతుల కారణంగా శివసాగర్ ప్రాజెక్టు కరకట్ట, చెక్ డ్యాంలకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు మాధవరెడ్డి, నాగప్ప, అశోక్, భాస్కరచారి, చెన్వీ రప్ప, గోపాల్, బసప్ప, బషీర్ తదితరులు ఉన్నారు.

16న పరిగికి మందకృష్ణ మాదిగ రాక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పరిగి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 16న పరిగి పట్టణానికి రానున్నట్లు ఆ సంఘం నియోజక వర్గ ఇన్‌చార్జ్ సుభాష్ మాదిగ తెలిపారు. సోమవారం పరిగి పట్టణంలోని ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ మొత్తం పెంచాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్ మాదిగ, ప్రశాంత్, వెంకటేష్, పుష్పరాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఏజెంట్‌గా ఎన్నికల కమిషన్

- దొంగ ఓట్లతోనే కేంద్రంలో అధికారం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్

పరిగి: కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీకి ఏజెంట్‌లా పనిచేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం పరిగి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ అంబేడ్కర్ అందరికీ సమానమైన ఓటు హక్కు కల్పిస్తే దాన్ని బీజేపీ దుర్వినియోగం చేస్తోందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో దొంగ ఓట్లతోనే అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. దేశంలో ఎన్నో స్థానాలను కాంగ్రెస్ తక్కువ ఓట్లతోనే ఓడిపోయిందన్నారు. అందుకు కారణం ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యమే అన్నారు. దొంగ ఓట్ల భాగోతాన్ని రాహుల్ గాంధీ బయట పెడితే నోటీసులు ఇస్తారా అని ప్రశ్నించారు. ఒకే ఇంటి నంబర్‌పై 80 మంది ఓటర్లను ఎలా నమోదు చేసుకుంటారు అని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ఖూనీ చేస్తోందని మండిపడ్డారు. ఈవీఎంలను రద్దు చేసి బ్యాలెట్ పేపర్ల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తుంటే కేంద్రం అడ్డు పడుతోందని విమర్శించారు.

విద్యావ్యవస్థ పటిష్టానికి కృషి

రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ డాక్టర్ చారకొండ వెంకటేష్

మాడ్గుల: విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ చారకొండ వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన మాడ్గుల జెడ్పీహెచ్ఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ ఫౌండేషన్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దూరప్రాంత విద్యార్థులకు స్కూల్ బస్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో 317 జీఓ రద్దు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

బాల్యానికి మూడుముళ్లు

అధికారులు అడ్డుకుంటున్నా ఆగని బాల్యవివాహాలు

'నందిగామ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక(13)కు మానసిక వైకల్యంతో బాధపడుతున్న కందవాడకు చెందిన ఓ వ్యక్తి(36)తో మే 28న నందిగామ శివారులోని ఓ ఆలయంలో వివాహమైంది. నిజానికి ఈ పెళ్లి చిన్నారికి ఏమాత్రం ఇష్టం లేదు. ఇదే అంశాన్ని సదరు విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులకు తెలియజేయగా, వారు పోలీసు, రెవెన్యూ, స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెళ్లి కుమారుడు, మధ్యవర్తి, పురోహితుడు, బాలిక తల్లిపై నందిగామ ఠాణాలో కేసు నమోదు చేసి సదరు బాధితురాలిని సఖీ కేంద్రానికి తరలించాల్సి వచ్చింది' అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

- అత్యవసర నంబర్లను ఆశ్రయిస్తున్న చిన్నారులు
- 2024లో తొలి మూడు స్థానాల్లో వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: అభివృద్ధిలో అంతర్జాతీయ దేశాలతో పోటీ పడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అదే స్థాయిలో సామాజిక వెనుకబాటుతనం వెంటాడుతోంది. నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలకు ఆర్థిక అసమానతలు తోడయ్యాయి. ఫలితంగా 18 ఏళ్ల తర్వాత జరగాల్సిన అమ్మాయిల వివాహ తంతు.. 14 ఏళ్లకే ముగుస్తోంది. తాను ఇప్పుడే పెళ్లి చేసుకోబోనని, అందరిలాగే తాను ఉన్నత చదువులు చదువుకుంటానని చెప్పినా.. తల్లిదండ్రులు వినిపించుకోవడం లేదు. బలవంతపు పెళ్లిళ్లకు పాల్పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో బాలికలు అత్యవసర ఫోన్ నంబర్లను ఆశ్రయిస్తున్నారు. గత ఏడాది నమోదైన బాల్య వివాహాలను పరిశీలిస్తే.. ఇదే విషయం స్పష్టమవుతోంది. గత ఏడాది అత్యధిక బాల్య వివాహాలు వెలుగు చూసిన జిల్లాలో జాబితాలో వికారాబాద్(94) ముందు వరుసలో నిలువగా, ఆ తర్వాత స్థానాల్లో రంగారెడ్డి(54), మేడ్చల్ (53) జిల్లాలు నిలవడం గమనార్హం. ఐటీ చదువులకు, అంతర్జాతీయ పెట్టుబడులకు నిల యంగా మారిన ఈ ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనం, బాల్య వివాహాలు వెలుగు చూస్తుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

ఆర్థిక అంతరాలే అసలు కారణం

అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు రాకతో జిల్లా ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. జిల్లాలోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, కొండాపూర్, సైబర్‌సిటీ, నానక్‌రాంగూడ, కోకాపేట్, నార్సింగి తదితర ప్రాంతాల్లో ఎకరం భూమి ధర రూ.వంద కోట్లకుపైగా పలుకుతోంది. ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్లు ఓఆర్‌ఆర్‌కు ఇరు పక్కలా హైరైజ్ భవనాలే దర్శనమిస్తున్నాయి. ఐటీ, వాటి అనుబంధ సంస్థలు, రియల్ ఎస్టేట్ పెట్టుబడులు భారీగా వచ్చి చేరడంతో ప్రజల జీవనశైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. తలసరి ఆదాయంలో దేశంలోనే ముందు వరుసలో నిలిచిన జిల్లా కూడా ఇదే. ఇలాంటి కీలకమైన జిల్లాలో ఇప్పటికీ అంతరాలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఉన్నవాడు మరింత ఉన్నవాడిగా, లేని వాళ్లు మరింత లేనివాళ్లుగా మారుతున్నారు. సామాజిక వెనుకబాటుకు ఆర్థిక పరమైన అంశాలు తోడవడంతో కడుపున పుట్టిన పిల్లలను వదిలించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల శంషాబాద్ మండలంలో ఓ తల్లి అప్పుడే పుట్టిన బిడ్డను ఇతరులకు అమ్ముకుని పట్టుబడగా, ఉన్నత చదువులు చదివించి, బిడ్డను మరింత ప్రయోజకురాలిని చేయాల్సిన మరో తల్లి ఏకంగా తన బిడ్డకంటే రెట్టింపు వయసున్న వ్యక్తికి కట్టబెట్టేందుకు సిద్ధపడింది. అంతర్జాతీయ వేదికపై ఓ వెలుగు వెలుగుతున్న ఉమ్మడి జిల్లాలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్ని పథకాలు ప్రవేశపెడుతున్నా.. రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి, పైసా ఖర్చు లేకుండానే ఉన్నత చదువులు చెప్పిస్తున్నా.. వివాహం, ఇతర అంశాలకు వచ్చే సరికి తల్లిదండ్రుల ఆలోచన భిన్నంగా ఉంటోంది. అభం శుభం తెలియని వయసులో పెళ్లి చేస్తుండటం ఆందోళనకు గురి చేస్తోంది.



ఆర్టీసీకి ఫుల్ గి'రాఖీ'

ప్రయాణికులతో రద్దీగా పరిగి బస్టాండ్(ఫైల్)

- రక్షాబంధన్‌తో కిటకిటలాడిన బస్సులు
- సమకూరిన రెండింతల ఆదాయం

వికారాబాద్: రాఖీ పండుగ ఆర్టీసీకి ఆదాయం సమకూర్చింది. మహిళలకు ఉచిత ప్రయాణంతో పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. రక్షాబంధన్‌తో రెండింత ఆదాయం వచ్చింది. జిల్లాలో మూడు ఆర్టీసీ డిపోలు(వికారాబాద్, తాండూరు, పరిగి) ఉండగా 200 పైచిలుకు బస్సులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున లక్ష మంది ప్రయాణికులు వారివారి గమ్యాలకు వెళ్తుంటారు. వికారాబాద్ డిపో పరిధిలో సాధారణ రోజుల్లో 15 వేల నుంచి 20 వేల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తుంటారు. రాఖీ పండుగ నేపథ్యంలో శని, ఆదివారాల్లో 74,242 మంది ప్రయాణించారు. మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా రోజుకు సగటున రూ.4 లక్షల ఆదాయం వచ్చేది.. పండుగ కారణంగా రోజుకు రూ.7 లక్షల చొప్పున రెండు రోజుల్లో రూ.14 లక్షల ఆదాయం సమకూరింది. తాండూరు డిపోలో సాధారణ రోజుల్లో రోజుకు సగటున రూ.10 నుంచి 12 లక్షల ఆదాయం వచ్చేది. రాఖీ నేపథ్యంలో రోజుకు రూ.20 లక్షల ఆదాయం దాటింది. గడిచిన మూడు రోజుల్లో ఈ డిపోకు రూ.66 లక్షలు సమకూరింది. పరిగి డిపోకి మూడు రోజుల్లో కలిపి రూ.72లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఇందులో 75శాతం వరకు మహాలక్ష్మి పథకంలో భాగంగా వచ్చిందే. సాధారణంగా రోజుకు రూ.16లక్షల వరకు ఆదాయం రాగా పండుగ సందర్భంగా రోజుకు రూ.25లక్షలు సమకూరింది.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు సాయికుమార్

మోమిన్‌పేట: మండలంలోని వెల్‌చాల్ గ్రామ శివారులో గల రైల్వే ట్రాక్ వద్ద ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వెల్‌చాల్ గ్రామానికి చెందిన మన్నే సాయికుమార్ (22) గ్రామ శివారులోని రైల్వే ట్రాక్ వద్ద విగతజీవిగా కనిపించాడు. మధ్యాహ్నం రైల్వే ఉద్యోగులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తన కుమారుడు సాయికుమార్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని తండ్రి మల్లేశం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి రైల్వే ట్రాక్ వద్ద పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.



డయాలసిస్ సేవలను పరిశీలిస్తున్న వైద్యులు

తాండూరు ఆస్పత్రికి మిషన్లు

- ఆరోగ్యశ్రీ రాష్ట్ర జీఎం డాక్టర్ రాంబాబు

తాండూరు టౌన్: తాండూరు జిల్లా ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌కు (రక్త మార్పిడి) కొత్తగా ఐదు మిషన్లు అందుబాటులోకి తెచ్చినట్లు ఆరోగ్య శ్రీ రాష్ట్ర జనరల్ మేనేజర్ డాక్టర్ రాంబాబు తెలిపారు. సోమవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉమ్మ డి రంగారెడ్డి జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్ రెడ్డిలతో కలిసి మిషన్ల ఏర్పాటు కోసం వసతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ నిర్వహించేందుకు జిల్లా ఆస్పత్రిలో ఎనిమిది మిషన్లు అందుబాటులో ఉన్నాయని, వీటి ద్వారా సుమారు 60 మంది పేషెంట్లకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితే మరో 30 మందికి పైగా పేషెంట్లు వేచి చూడాల్సి వస్తోందన్నారు. దీంతో నూతనంగా ఐదు మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. త్వరలో వీటని ప్రారంభిస్తామన్నారు. డయాలసిస్ సేవల కోసం 94929 13384 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర డయాలసిస్ మేనేజర్ కిషన్ కిషోర్, జిల్లా ఇన్‌చార్జ్ టీం లీడర్ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నలిపేద్దాం

- వైద్యుల పర్యవేక్షణలోనే అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్



విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలందరూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం వికారాబాద్‌లోని కొత్త గడి బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొంతమంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేషనల్ డీ వార్మింగ్ డేకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. నులిపురుగుల కారణంగా పిల్లల ఎదుగుదలలో ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. వాటి నివారణ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేసినట్లు వివరించారు. నులిపురుగుల కారణంగా ఆహారం ఎంత తీసుకున్నా బరువు పెరగరని, బలహీనంగా ఉంటారని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా వాటిని నివారించవచ్చని పేర్కొన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే మాత్రలు వేసుకోవాలన్నారు. ఈ రోజు స్కూళ్లకు రాని పిల్లలకు 19వ తేదీ వరకు అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి మాత్రల పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి లలితాదేవి, శిశు సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, డాక్టర్ పవిత్ర, రెసిడెన్షియల్ వైస్ ప్రిన్సిపాల్ మంజుల, ప్రోగ్రాం అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సత్వరం పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 84 అర్జీలు వచ్చాయి. వీటిని ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారించాలి

కొడంగల్: పిల్లల్లో నులి పురుగులను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీంద్రా యాదవ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, అంగడిరాయిచూర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దానమ్మదేవి అలంకరణ



అలంకరణలో స్వామివారు

తాండూరుటౌన్: శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని తాండూరు పట్టణంలోని శ్రీభావిగి భద్రేశ్వరస్వామి దేవస్థానంలోని శివాలయంలో పరమశివుడు మహారాష్ట్రలో వెలిసిన దానమ్మదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుక్కల దాడిలో 12 మేకపిల్లలు మృతి



మృతి చెందిన మేకపిల్లలు

ధారూరు: వీధి కుక్కల దాడిలో 12 మేకపిల్లలు మృతిచెందిన ఘటన అంతారంలో చోటుచేసుకుంది. బాధితుడు చాకలి యాదయ్య వివరాల ప్రకారం.. చుట్టూ ఇనుప కంచె ఉన్న కొట్టంలో ఆదివారం ఉదయం 12 మేకపిల్లలను వదిలివెళ్లాడు. వీధి కుక్కలు లోనికి జొరబడి తీవ్రంగా గాయపర్చడంతో అవి చనిపోయాయి. సాయంత్రం వచ్చి చూసిన బాధితుడు బోరున విలపించాడు. తనకు రూ.50 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు. నాగారం ఉప పశువైద్యాధికారి సురేందర్ సోమవారం గ్రామానికి వెళ్లి మేకపిల్లకు పోస్టుమార్టమ్ నిర్వహించారు.

ఎన్ఐఎంయూ, ఎఫ్సీడీఏ ఏర్పాటుకు స్థల పరిశీలన



మీర్ఖాన్పేట రెవెన్యూలోని భూములను పరిశీలిస్తున్న అధికారులు

కందుకూరు: ఫ్యూచర్సిటీ భూముల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్(ఎన్ఐఎంయూ), ఎఫ్సీడీఏ (ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ) కార్యాలయాల ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారు. ఎఫ్సీడీఏ కమిషనర్ శశాంక, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ (ఎంఓహెచ్యూఏ) కార్యదర్శి కె.శ్రీనివాస్, జీహెచ్ఎంసీ కమిషన్ ఆర్వీ కర్ణన్ తదితరులు సోమవారం మండల పరిధిలోని మీర్ఖాన్పేట రెవెన్యూలోని సర్వే నంబర్ 112 లోని భూమిని పరిశీలించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ కోసం గతంలో కేటాయించిన 20 ఎకరాలు, ఎఫ్సీడీఏ కార్యాలయం కోసం అదే సర్వే నంబర్లో 7.20 ఎకరాలను క్షేత్రస్థాయిలో స్థల పరిశీలన చేశారు. వారి వెంట ఆర్డీఓ జగదీశ్వర్రెడ్డి, తహసీల్దార్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుపై నిరసన



బురద నీటిలో వరి నాట్లేస్తున్న గ్రామస్తులు

యాచారం: వర్షాలకు గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేయాలని తక్కళ్లపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తక్కళ్లపల్లి- తక్కళ్లపల్లి గేట్ మధ్యన ధ్వంసమైన రహదారిపై వరి నాటు వేసి నిరసన వ్యక్తంచేశారు. అధ్వానంగా మారిన రోడ్డుతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియడం లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీఓ, పంచాయతీరాజ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఆందోళన చేసిన వారిలో బీజేపీ నాయకులు పగడాల శ్రీశైలం, కుమార్ యాదవ్, డాక్టర్ సురేందర్, గడల సురేష్, బాబురావు, నర్సింహ, అంజయ్య, రాములు ఉన్నారు.

ఏఈఈలకు పదోన్నతులు

డీఈఈలుగా ప్రమోషన్, బదిలీ

కేశంపేట: ఇరిగేషన్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న ఐదుగురికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్గా పదోన్నతులు లభించాయి. షాద్నగర్ పరిధి ఫరూఖ్నగర్ మండలంలో ఏఈఈగా పనిచేస్తున్న సుజాతను నారాయణపేటకు, కొందుర్గు మండలంలో పనిచేస్తున్న క్రాంతిని వనపర్తి జిల్లా పెబ్బేరు ఎస్ఈ కార్యాలయానికి, కేశంపేటలో విధులు నిర్వర్తిస్తున్న గీతను వనపర్తికి, రేఖను జహీరాబాద్, మాధవిని జగిత్యాల జిల్లాకు బదిలీ చేస్తూ, ప్రమోషన్లు కల్పించారు.



చేవెళ్ల: ఆలూరులోని పెద్ద వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు



యాలాల: మండలంలో కురుస్తున్న వర్షం



దుద్యాల్: ఈర్లపల్లిలో భారీగా కురుస్తున్న వాన

భారీ వర్షం.. అతలాకుతలం



తాండూరు: ఇందిరానగర్లో కూలిన ఇంటి పైకప్పు

కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం ఆగమాగం అవుతోంది. సోమవారం సైతం విస్తారంగా వాన పడడంతో వాగులు, వంకలు, డ్రైనేజీలు పొంగిపొర్లాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు కొనసాగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడి సరఫరాలో అంతరాయం కలిగింది. ఇళ్లల్లోకి నీరు చేరడంతో కొన్ని ధ్వంసమయ్యాయి. పంట పొలాల్లోకి వరదనీరు చేరడంతో నీట మునిగాయి. చెరువులు అలుగు పారాయి. రహదారులపై రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు.

– సాక్షి, నెట్వర్క్



తాండూరు రూరల్: బెల్కటూర్ వద్ద డైవర్షన్ రోడ్డుపై పారుతున్న వాగు



యాలాల: లక్ష్మీనారాయణపూర్-దేవనూరు రోడ్డుపై గుంతల్లో నిలిచిన వరదనీరు



చేవెళ్ల: ధర్మసాగర్ సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



చేవెళ్ల: ఆలయ కమాన్ ఎదుట చేరిన వరద నీరు

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వీఐపీలు, అధికారులు, మీడియా ఇతరులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్య అతిథి సందేశం రూపొందించేదుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపాలన్నారు. వేడుకలకు హాజరయ్యే అతిథికి గౌరవ వందనంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దని విద్యుత్ అధికారులకు సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓకు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్కుమార్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్లో పెట్టొద్దు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్లో పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కె.శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలను పెండింగ్లో ఉంచకుండా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ప్రజావాణికి 61 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కరెంటోళ్లకు దండాలు



రైతు సాయంతో చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం వద్దకు వెళ్తున్న శ్రీకాంత్



మరమ్మతుల కోసం స్తంభం ఎక్కుతూ..

కేశంపేట: ప్రజలకు వెలుగులు పంచే క్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పలపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. వేములనర్వ గ్రామ పరిధిలోని చౌదరిగూడ ఫీడర్కు కరెంట్ సరఫరా చేసే స్తంభంపై ఆదివారం రాత్రి అంతరాయం ఏర్పడింది. ఏఈ ఈశ్వర్, లైన్ ఇన్స్పెక్టర్ రాజు, అసిస్టెంట్ లైన్మెన్ శ్రీకాంత్ సోమవారం ఉదయం విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇప్పలపల్లి చెరువులోని స్తంభంపై ఇన్సులేటర్ కాలిపోయినట్లు అసిస్టెంట్ లైన్మెన్ శ్రీకాంత్ గుర్తించాడు. స్థానిక రైతు శ్రీనివాస్రెడ్డి సాయంతో నీట మునిగిన స్తంభంపైకి ఎక్కి ఇన్సులేటర్ బిగించి సమస్యను పరిష్కరించారు. ఇది చూసిన స్థానిక ప్రజలు, రైతులు కరెంటోళ్లకు దండాలు అంటూ ధన్యవాదములు తెలియజేశారు.

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

కేశంపేట: నైట్ హాల్ట్ ఆర్టీసీ బస్సు నుంచి గుర్తు తెలియని దుండగులు డీజిల్ దొంగిలించారు. ఈ ఘటన మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి ఫలక్నుమా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అఫ్జల్గంజ్ నుంచి కొండారెడ్డిపల్లి గ్రామానికి రాకపోకలను సాగిస్తుంది. రాత్రి కొండారెడ్డిపల్లి గ్రామంలోనే బస్సు నిలుపుతారు. ఆదివారం రాత్రి బస్సును నిలిపి, డ్రైవర్, కండక్టర్లు నిద్రించారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని దొంగ ఆర్టీసీ బస్సు నుంచి సుమారుగా 90 లీటర్ల డీజిల్ను దొంగిలించాడు. డ్యూటీ డ్రైవర్ రిపోర్టింగ్ సమయంలో చోరీ జరిగినట్లు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామానికి చెందిన పల్లె బాలీశ్వర్ రూ.5 వేలు, కానం ప్రేమ్ కుమార్గౌడ్ రూ.3 వేలు వెచ్చించి డీజిల్ పోయించారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.



దౌల్తాబాద్: సీఎం రేవంత్రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ



కొడంగల్: ముఖ్యమంత్రికి పెళ్లి శుభలేఖ ఇస్తున్న మురహరి

సమస్యలు పరిష్కరించాలి

- సీఎం రేవంత్రెడ్డిని కోరిన కృష్ణ

దౌల్తాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత, మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఒకేషనల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని దౌల్తాబాద్కు చెందిన ఒకేషనల్ టీచర్ కుర్మని కృష్ణ సీఎంను కోరారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని నగరంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1,200 మంది ఒకేషనల్ టీచర్లు పనిచేస్తున్నారని.. తమకు ఏడాదికి 10 నెలల జీతం మాత్రమే అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 12 నెలల పాటు జీతం అందేలా చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. తమ సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన మురహరి

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కొడంగల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట సోమవారం హైదరాబాద్లో కలిశారు. ఈ నెల 14న నగరంలో జరగనున్న మురహరి వశిష్ట అన్న కూతురు వివాహానికి రావాలని సీఎంకు పెళ్లి పత్రిక అందించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి కృష్ణంరాజు, మున్సిపల్ కో ఆప్షన్ మాజీ సభ్యుడు మునీర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణ మన బాధ్యత

- క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలి
- ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పరిగి: నేరాల నియంత్రణకు పోలీసు అధికారులు కృషి చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పరిగి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కేసులు తగ్గించేందుకు శ్రమించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. యువత తప్పుదోవ పట్టించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. దొంగతనాల కేసుల పట్ల ప్రత్యేక చొరవ చూపి వాటిని త్వరగా ఛేదించాలని తెలిపారు. ప్రజలకు సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్రెడ్డి, ఎస్ఐ మోహన్ కృష్ణ, ఆయ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి



గేదె కళేబరం వద్ద రైతు బలరాం

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి చెందిన ఘటన సోమవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివారలు.. గ్రామానికి చెందిన రాయికంటి బలరాం పాడిగేదెలను పోషిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. పాడిగేదెను మేపుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్షాక్కుగురై అక్కడిక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని.. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

గంట్లవెల్లి ఎంపీపీఎస్లో ఫ్యాన్లు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన సీలింగ్ ఫ్యాన్లు

షాద్నగర్రూరల్: ప్రభుత్వ పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని గంట్లవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల(ఎంపీపీఎస్)లో సోమవారం వెలుగులోకి వచ్చింది. పాఠశాల హెచ్ఎం శ్రీధర్రెడ్డి దాతల సహకారంతో విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదుల్లో, వరండాలో సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయించారు. వరుస సెలవులు ఉండడంతో వరండాలోని ఫ్యాన్లను దుండగులు ధ్వంసం చేశారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు పాఠశాల మైదానంలో ఆడుకునేందుకు వస్తుంటారని.. వారిలో ఎవరైనా ఈ పని చేసి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్ఎం శ్రీధర్రెడ్డి తెలిపారు.

తాళం వేయ'బడి'!

- తెరుచుకోని గుంతబాస్పల్లి పాఠశాల
- విద్యాశాఖ పనితీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

తాండూరు రూరల్: విద్యాశాఖ పనితీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలోని గుంతబాస్పల్లి పాఠశాల సోమవారం తెరుచుకోలేదు. వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో గత శుక్రవారం మండలవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఆప్షనల్ హాలిడే తీసుకున్నారు. మరుసటి రోజైన శనివారం రాఖీ పండుగ, ఆతర్వాత ఆదివారం మూడు రోజుల పాటు వరుస సెలవులు తీసుకున్నారు. కానీ గుంతబాస్పల్లి ప్రాథమిక పాఠశాలకు సోమవారం కూడా సెలవు ప్రకటించుకున్నారు. ఈ స్కూల్లో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. హెచ్ఎంతో పాటు మరో మహిళా టీచర్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు స్కూల్కు సరిగ్గా రావడం లేదంటూ గతంలో పలుమార్లు తల్లిదండ్రులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి మీడియాలో కథనాలు రావడంతో ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. అయినప్పటికీ వీరి తీరు మారలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం స్కూల్ను ఎలా మూత పెడతారని మండిపడ్డారు. ఈ విషయమై హెచ్ఎం జగన్నాథంను వివరణ కోరగా శ్రావణమాసం మూడో సోమవారం నేపథ్యంలో స్కూల్కు లోకల్ హాలిడే ఇచ్చామని తెలిపారు. దీనిపై ఎంఈఓ వెంకటయ్యను అడగగా గ్రామంలో ఎలాంటి జాతర, బోనాలు లేకపోయినప్పటికీ లోకల్ హాలిడే ఇవ్వడం సరికాదని, ఈ విషయమై మంగళవారం స్కూల్కు వెళ్లి విచారణ నిర్వహిస్తామని చెప్పారు.



గుంతబాస్పల్లి పాఠశాలకు తాళం

సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుతాం

- ఆఫీసులు, విద్యాలయాలపై సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం
- మెరుగైన విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నాం
- పేదలందరికీ రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మొయినాబాద్: భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ముర్తుజగూడలో చిలుకూరు, బాకారం, నవాబ్పేటకు సంబంధించిన 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లకు ఎమ్మెల్సీ మహేందర్రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భట్టి మాట్లాడుతూ.. సోలార్ ఉత్పత్తిని పెంచడంకోసం అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా ఇప్పటికే ఆదేశాలిచ్చామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో పూర్తిగా సోలార్ విద్యుత్ను అందించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, దేవాదాయ, ఇరిగేషన్ భూముల్లో అనుకూలతను బట్టి సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ పంపిణీ వ్యవస్థను సైతం పెంచేందుకు కొత్తగా సబ్స్టేషన్లు, ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని.. అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడం కోసం రాష్ట్రంలో 104 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొయినాబాద్ ప్రాంతంలో పట్టణీకరణ పెరుగుతుండడంతో పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రాంత విద్యుత్ అవసరాల కోసం 132 కేవీ సబ్ స్టేషన్ను మంజూరు చేస్తున్నామని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్రెడ్డి, అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ గౌతమ్కుమార్, విద్యుత్ శాఖ సీఎండీ ముషరఫ్అలీ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.